క్లుప్తంగా

విజయానందరెడ్డి నామినేషన్‌కు తరలిరండి

శ్రీరంగరాజపురం: మండలంలోని కొటార్లపల్లి ఎంసీ విజయానందరెడ్డి స్వగ్రామం. ఈయన చిత్తూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న విషయం విదితమే. గురువారం ఆయన నామినేషన్ దాఖలు చేయనున్న సందర్భంగా మండలం నుంచి పెద్దఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో తరలి రావాలని మండల కన్వీనర్ మణి బుధవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. గురువారం ఉదయం 8 గంటలకు 49 కొత్తపల్లిమిట్ట వద్దకు చేరుకోవాలన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

నగరి: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాద నివారణపై ప్రజలకు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని గుండ్రాజుకుప్పం గ్రామంలో పర్యటించిన ఆయన అగ్ని ప్రమాదాల నివారణ, మంటలను అదుపుచేసే ప్రక్రియలపై డెమో ఇచ్చారు. మంటలు ఎక్కువగా వచ్చినపుడు వాటిని ఎలా ఆర్పాలో ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది చంద్రశేఖర్ రాజు, ప్రవీణ్‌కుమార్, విజయ, మోహన్, ప్రకాష్, రామచంద్రయ్య, కోటేశ్వర రావు, మధు, లోకయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నేత మృతి



చిన్ని కిషోర్(ఫైల్)

గంగాధరనెల్లూరు: మండలంలోని జీడీ నెల్లూరు పంచాయతీ సీఆర్ కండిగ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్ని కిషోర్ కుమార్ (42)బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. వివరాలు.. గత ఆరు నెలలుగా గుండె నొప్పితో కిషోర్ సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తాజాగా బుధవారం ఆయనకు ఇంటి వద్ద గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయి మృతి చెందాడని తెలిపారు. పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనే చిన్ని మరణం పార్టీకి తీరని లోటు అని స్థానిక పార్టీ నాయకులు తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ కే.విజయకుమార్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు పెనుమూరు పర్యాటక కేంద్రం పులిగుండు వద్ద ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, రాష్ట్ర ప్రభుత్వ విదేశీ వ్యవహారాల సలహాదారు మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త మహాసముద్రం కిరణ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మి, ఎంపీపీ హేమలతారెడ్డి పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి



వెంకటశివ, ఆర్‌ఓ, జీడీనెల్లూరు

గంగాధర నెల్లూరు: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ తెలిపారు. బుధవారం ఆయన తహసీల్దార్ కార్యాయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. 18వ తేదీ గురువారం నుంచి ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థితో పాటు నలుగురు వ్యక్తులను మాత్రమే లోపలకు అనుమతిస్తామని తెలిపారు. నామినేషన్ దాఖలు చేసే ఎమ్మెల్యే అభ్యర్థులతో పాటు వారి నేతలు కార్యకర్తలు 144 సెక్షన్ అమల్లో ఉన్నచోట టపాసులు కాల్చకూడదని హెచ్చరించారు. సమావేశంలో ఏఆర్‌ఓ రవి, డీటీ తులసిరామ్, ఎన్నికల డీటీ విజయ్‌కృష్ణ, సర్వర్ గణేష్, ఏఎస్‌ఓ ఆనంద మోహన్, పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

పుత్తూరు: వడమాలపేట మండలం ఎస్వీపురం వడ్డిపల్లిలోని బంగారమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు ఆలయ ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి గర్భగుడిలో ఉన్న హుండీని సమీప మామిడి తోటలోకి తీసుకెళ్లి, అక్కడ పగులగొట్టి అందులో ఉన్న సొమ్మును ఎత్తుకెళ్లారు. రెండేళ్లుగా హుండీ లెక్కింపు చేయలేదని, ఈ నేపథ్యంలో సుమారు రూ.1 లక్ష వరకు నగదు చోరీ అయి ఉంటుందని గ్రామస్తులు భావిస్తున్నారు. ఈ మేరకు వడమాలపేట పోలీసులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

సంక్షేమానికి కేరాఫ్ జగనన్న



నార్పరాజుకండ్రిగలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి ఆర్కే రోజా



మంత్రి రోజా సమక్షంలో పార్టీలో చేరిన వడమాలపేట నాయకులు

- కరువుకు చిరునామా చంద్రబాబు
- నగరి గడ్డపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం : మంత్రి రోజా
- విజయపురంలో మంత్రికి అడుగడుగునా స్వాగతం



మల్లారెడ్డికండ్రిగలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి ఆర్‌కే రోజా

విజయపురం: సంక్షేమానికి కేరాఫ్ జగనన్న.. కరువుకు కేరాఫ్ చంద్రబాబు అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం ఆమె విజయపురం మండలం నారపరాజు కండ్రిగ, మల్లారెడ్డి కండ్రిగ, లక్ష్మీవిలాసపురం, శ్రీహరిపురం, మహారాజపురం, ఎస్సీ, ఎస్టీ కాలనీలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రోజాకు ప్రజలు అడుగడుగునా హారతులు పట్టి స్వాగతించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలకు వివరించి ఓటు అడుగుతున్న పార్టీని చరిత్రలో ఇప్పుడే చూస్తున్నామని తెలిపారు. ఐదేళ్లపాటు సంక్షేమ పాలన అందించిన మా బిడ్డ జగన్‌ను, మాకు మంచి చేస్తున్న రోజాను ఎవరూ దూరం చేసుకోమన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగనన్న అందించిన సంక్షేమ పాలనతోనే ప్రజలకు సేవ చేయడం సాధ్యమైందన్నారు. సంక్షేమానికి కేరాఫ్ జగనన్న అయితే కరువుకు కేరాఫ్ చంద్రబాబు అని, ఈ విషయాన్ని ప్రజలంతా తెలుసుకున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజల మన్ననలు పొందడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే సాధ్యమైందన్నారు. ఈ అభిమానం ఇలాగే ఉండాలని తనకు హ్యాట్రిక్ విజయాన్ని అందించి జగనన్న ముఖ్యమంత్రిగా ఉండేలా ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, ఆర్‌బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, కన్వీనర్ గోపీనాథ్, మాజీ కన్వీనర్ రామకృష్ణమరాజు, సర్పంచ్‌లు కుమార్, కుప్పారెడ్డి, శాంతి, గోవర్ధన్‌నాయుడు, హరినాయుడు, శివరాజు, కుమార్‌రెడ్డి, నారపరాజు, భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, అరుణాచలం, జిల్‌దాస్, బెన్ని, కుప్పస్వామి, పాండియన్, ప్రతాప్‌రాజు, రమేష్‌రాజు, లాయర్‌బాబు, కిషోర్‌రెడ్డి, గోవర్ధన్, కుమార్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక ..

మండలంలోని మల్లారెడ్డికండ్రిగ ఆదిఆంధ్రవాడకు చెందిన టీడీపీ, జనసేన పార్టీ నాయకులు తమ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం మంత్రి ఆర్కే రోజా సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి ఆర్కే రోజా నార్పరాజుకండ్రిగ, మల్లారెడ్డికండ్రిగ, శ్రీహరిపురంలో ప్రచారం పర్యటించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శాంతి ఆధ్వర్యంలో మల్లారెడ్డికండ్రిగ ఆదిఆంధ్రవాడకు చెందిన టీడీపీ, జనసేన పార్టీ నాయకులు అరుణాచలం, మునిరాజ్, ప్రభు, మునస్వామి, హేమాద్రి, వినోద్, మునిశేఖర్, ప్రియా, మొగిలీశ్వరి, పద్మ, మునిరత్నంతో పాటు 10 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మంత్రి రోజా వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు.

వడమాలపేటలో 50 మంది చేరిక

పుత్తూరు: వడమాలపేటకు చెందిన 50 మంది టీడీపీ, జనసేన నాయకులు బుధవారం పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంపీపీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నవీన్, నాగార్జున మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వెల్లడించారు. రోజమ్మ గెలుపునకు కృషి చేస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో కృష్ణయ్య, హరి, ఠాగూర్, భాగ్యరాజు, వెంకటేష్, భరత్‌కుమార్, గణేష్‌కుమార్, జ్ఞానశేఖర్, వెంకటముని, వాసు, చంద్ర తదితరులు ఉన్నారు.

వైభవంగా గంగ జాతర



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

నగరి: నగరి రూరల్ మండలం మాంగాడు గ్రామంలో గంగమ్మ జాతర వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. డప్పువాయిద్యాల మధ్య గంగమ్మ మంగళవారం రాత్రి ఊరిమధ్యలో వేసిన వేపాకు గుడిసెకు వచ్చిచేరింది. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారికి చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వేపాకు సారెలు సమర్పించి తడిదుస్తులతో అంగప్రదక్షిణ చేశారు. గంగమ్మను దర్శంచుకుని మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం సాయంత్రం గంగమ్మను డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి పొలిమేర దాటించారు.

వలంటీర్ రాజీనామా



వలంటీర్ రఘుపతి

నగరి: మున్సిపల్ పరిధిలోని కరకంతాపురం గ్రామానికి చెందిన వలంటీర్ ఎంజీ రఘుపతి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నేతల అనుచిత వ్యాఖ్యలకు మనస్తాపం చెందానన్నారు. మనస్ఫూర్తిగా సేవచేస్తుంటే అసత్య ఆరోపణలు చేయడం దారుణమన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వానికి అండగా నిలుస్తానన్నారు.

మరోసారి వైఎస్సార్‌సీపీని ఆదరించండి



పార్టీ నాయకులతో కలిసి పుత్తూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కుమారస్వామిరెడ్డి

పుత్తూరు: నగరి నియోజకవర్గ ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజాను మరోసారి ఆదరించాలని వైఎస్సార్‌సీపీ నేత వై.కుమారస్వామిరెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. బుధవారం మున్సిపాలిటీ 24వ వార్డులో ఆయన ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, రోజమ్మ నేతృత్వంలో నగరిలో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. తొలిసారిగా ఎన్నికల ప్రచారం నిమిత్తం పుత్తూరుకు వచ్చిన కుమారస్వామిరెడ్డిని పార్టీ నాయకులు గజమాలతో సత్కరించి, ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా రంజక పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా, నగరి ఎమ్మెల్యేగా మూడవసారి రోజాకు పట్టం కడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, కౌన్సిలర్లు రాధ, ఏకాంబరం, నరసింహారావ్, పవన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు మనోహర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, లారీమోహన్, మునిరత్నం, ప్రసాద్, సుబ్రమణ్యం, వెంకటేశన్ రెడ్డి, శివారెడ్డి, తిరునావకరుసు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి



జీఎస్ కండ్రిగలో ప్రచారం చేస్తున్న మధుసూదన్‌రెడ్డి

నింద్ర: రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని రాష్ట్ర ఉపాధిహామీ పథకం కౌన్సిల్ సభ్యులు, నగరి నియోజకవర్గ పరిశీలకులు మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన జీఎస్ కండ్రిగ పంచాయతీలోని గొల్లకండ్రిగ, ఆలపాకం కండ్రిగ, దేశూరు కండ్రిగ గ్రామాల్లో 'మేము సిద్ధం- మా బూత్ సిద్ధం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో వెలుగులు నింపిన ఘనత సీఎం జగనన్నదే అన్నారు. తిరిగి రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు జరగాలంటే మరోమారు మనం జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్, వైస్ ఎంపీపీ శుభ, మండల కన్వీనర్ వేణురాజు, ఎంపీటీసీ సభ్యులు విజేష్, కోఆప్షన్ సభ్యులు అనిల్, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, సర్పంచ్‌లు రవిరెడ్డి, రాజేష్, ఆర్‌బీకే చైర్మన్ వీరయ్యనాయుడు, నాయకులు మురళీకృష్ణ, సురేష్, హరి, రాజేష్, ఆనందయ్య, శివారెడ్డి, అమర్‌నాథ్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అడుగుజాడల్లో థామస్

- అసత్యాలతో సానుభూతి పొందేందుకు కుటిలయత్నం
- జీడీనెల్లూరు టీడీపీ ఇన్‌చార్జ్ థామస్‌పై వైఎస్సార్‌సీపీ నేతల ఫైర్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

శ్రీరంగరాజపురం: అసత్యాలను ప్రచారం చేయడంలో చంద్రబాబును మించిన ఘనుడు గంగాధరనెల్లూరు టీడీపీ ఇన్‌చార్జ్ థామస్ అని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుప్పయ్య ఆరోపించారు. బుధవారం జరిగిన మండలకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసత్యాలు సృష్టించడంలో చంద్రబాబుకు ఏ మాత్రం తీసిపోని విధంగా థామస్ తనపై హత్యయత్నం జరిగిందని అసత్య ఆరోపణలు చేయడం దారుణమన్నారు. చెన్నైకి వెళ్తుండగా థామస్ కారును ఓ లారీ వెంబడించిందని, ఆ లారీతో తనను హత్య చేయడానికే డిప్యూటీ సీఎం నారాయణస్వామి పంపించారని చెప్పడం తగునా అని ప్రశ్నించారు. మీరే డివైడర్‌ను గుద్ది ఆ నేరాన్ని డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై మోపడం మంచి పద్ధతి కాదన్నారు. నిజంగా హత్యాయత్నం జరిగితే జాతీయ రహదారి వెంబడి సీసీ పుటేజీలు ఉంటాయని, అలాంటప్పుడు ఆ లారీపై ఎందుకు కేసు పెట్టలేదు అని ప్రశ్నించారు.క్ష ప్రజల్లో సింపతీ తెచ్చుకునేందుకు ఇలాంటి అసత్య ఆరోపణలు చేయడం మీకు, మీ పార్టీ అధినేత చంద్రబాబుకే చెల్లునని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రమణ ప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ మణి, నాయకులు జనార్ధన్, భూపతిరెడ్డి, బాబు, హరిరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో తారాస్థాయికి చేరిన వర్గపోరు

- శ్రీకావేరిరాజుపురంలో జరిగిన ఆత్మీయ సమావేశానికి టీడీపీ ఇన్‌చార్జ్ థామస్‌తో పాటు భీమనేని వర్గం ఢుమ్మా
- పక్క మండలాల నుంచి నాయకులతో సమావేశం నిర్వహణ
- ముఖ్యఅతిథిగా హాజరైన మాజీమంత్రి అమరనాథరెడ్డి

పాలసముద్రం: తెలుగుదేశం పార్టీలో అంతర్గత వర్గపోరు తారాస్థాయికి చేరుకుంది. పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉన్నారు ఇరువర్గాలకు చెందిన తమ్ముళ్లు. తాజాగా శ్రీకావేరిరాజుపురంలో బుధవారం జరిగిన తెలుగుదేశం ఆత్మీయ సమావేశానికి టీడీపీ ఇన్‌చార్జ్ థామస్‌తో పాటు భీమనేని చిట్టిబాబు నాయుడు వర్గం ఢుమ్మా కొట్టింది. వీరు సింహరాజుపురం సమీపంలోని మామిడి తోటలో విందు ఏర్పాటు చేసుకున్నారు. అయితే మరోవర్గానికి నేతృత్వం వహిస్తున్న మాజీ ఎంపీటీసీ బాబునాయుడు, ఇందిరమ్మ బుధవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి పక్క మండల నాయకులతో నిర్వహించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ సమావేశానికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి థామస్ కూడా హాజరు కాకపోవడంతో బాబు నాయుడు, ఇందిరమ్మ వర్గం వారు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. థామస్ కూడా భీమనేని వర్గానికి చెందిన వాడేనని పలువురు టీడీపీ నేతలు విమర్శించారు. రెండు రోజుల నుంచే చిట్టిబాబు నాయుడు వర్గాన్ని చెందిన నాయకులకు ఆత్మీయ సమావేశానికి హాజరు కాకూడదని ఆదేశాలు అందాయి. దీంతో వారు ఢుమ్మా కొట్టి విందు ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఇప్పుడే ఇలా ఉంటే మనం మళ్లీ గెలవడం గగనమే అని నిరాశ వ్యక్తం చేశారు. ఈ ఆత్మీయ సమావేశానికి భీమనేని చిట్టిబాబు వర్గం వారు హాజరు కాలేదని తెలుసుకున్న మాజీమంత్రి అమరనాథరెడ్డి, టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు భీమనేనికి నచ్చజెప్పి సమావేశానికి తీసుకొచ్చారు. అప్పటికే సమయం మించి పోవడంతో నాయకులు విసిగి వెళ్లిపోయారు. ఆరు మండలాల టీడీపీ అధ్యక్షులకు కూడా భీమనేని చిట్టిబాబు నాయుడుతో విభేదాలు ఉన్నాయని సమావేశానికి వచ్చిన నాయకులు చర్చించుకోవడం గమనార్హం.

సారా బట్టీపై దాడులు



నిందితుడు సుందరేశన్ అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ

పాలసముద్రం: మండలంలోని నరసింహపురంలో బుధవారం సారా బట్టీలపై దాడులు చేసినట్లు ఎస్‌ఐ భారతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ నరసింహపురం గ్రామస్తుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు గ్రామ సమీపంలో సారా కాస్తున్న సుందరేశన్‌ను అరెస్టు చేసి, సారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని, కేసు దర్యాప్తు చేస్తామని తెలిపారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

- ఏర్పాట్లను పరిశీలించిన ఆర్వో, డీఎస్పీ



పోలింగ్ కేంద్రం నుంచి కొలతలు తీస్తున్న ఎన్నికల అధికారులు

నగరి: అసెంబ్లీ నియోజకవర్గానికి నామినేషన్లు స్వీకరించే ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి ఎన్నికల అధికారి, నగరి ఆర్డీఓ వెంకటరెడ్డి, నియోజకవర్గ సెక్యూరిటీ ఆఫీసర్ డీఎస్పీ నరసింహ మూర్తి నేతృత్వంలో బుధవారం పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. నగరి తహసీల్దార్ కార్యాలయాన్ని పోలింగ్ కేంద్రంగా ఏర్పాటుచేసినట్లు అధికారులు ఇదివరకే ప్రకటించారు. బుధవారం నామినేషన్‌కు సంబంధించిన ప్రక్రియను ముమ్మరంగా నిర్వహించారు. దీనిపై ఆర్వో మాట్లాడుతూ నామినేషన్‌కు సంబంధించి ఆర్వో ఆఫీసు నందు నోటీస్ బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి వంద మీటర్ల దూరాన్ని లెక్కించి మార్కింగ్‌లు వేయడం జరిగిందన్నారు. మార్కింగ్ చేసిన ప్రాంతం వరకే నామినేషన్‌కు ర్యాలీగా వచ్చే వారిని అనుమతిస్తామని అక్కడి నుంచి 3 వాహనాలకు అభ్యర్థితో పాటు ఐదుగురు సభ్యులకు అనుమతి ఉంటుందని, డీఎస్పీ ర్యాంకింగ్ అధికారి ఈ అంశాన్ని పర్యవేక్షిస్తారన్నారు. నామినేషన్ ప్రక్రియ నిమిత్తం కేంద్రం వద్ద బాండ్ రిజిస్టర్, జిరాక్స్ మెషీన్ సిద్ధంగా ఉంచామన్నారు. పర్యవేక్షణకు 360 డిగ్రీల సీసీ కెమెరా ఉంటుందని, విద్యుత్ అంతరాయం లేకుండా విధులు నిర్వహిస్తామన్నారు. అఫీషియల్ ఫొటోగ్రాఫర్, వీడియో గ్రాఫర్ కేంద్రంలోనే ఉంటారన్నారు. నామినేషన్లు పొందుపరచడానికి లాకర్‌తో కూడిన సేఫ్టీ ర్యాక్ డిజిటల్ లాక్‌తో ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల్లోపు కేంద్రంలోకి వచ్చే వారికి స్లిప్పులు అందించడం జరుగుతుందని, ఆపై వచ్చే వారిని అనుమతించమని చెప్పారు. కేంద్రంలోకి ప్రవేశించే అభ్యర్థులు తొలుత ఎన్నికల జాబితాను చెక్‌చేసుకుని ఆపై సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆయన వెంట తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జగదానంద కారకా.. జయజానకి ప్రాణనాయకా



పుత్తూరు: రాచపాళెంలో సీతారాముల కల్యాణం





వెదురుకుప్పం: ప్రత్యేక అలంకరణలో సీతారాములు, నగరి : పాతభజన గుడివీధిలో..



శ్రీరంగరాజపురంలో..



అయనంబాకం రామాలయంలో..

పుత్తూరు: కోటి జన్మల పుణ్యఫలం.. సీతారాముల కల్యాణం అని వేదపండితులు వర్ణించారు. బుధవారం నగరి నియోజకవర్గవ్యాప్తంగా ప్రతి పట్టణం, పల్లె కూడా శ్రీరాముడి నామస్మరణను స్తుతించాయి. ప్రజలు శ్రీరామనవమి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పుత్తూరు మండలంలోని రాచపాళెం రామాలయంలో ప్రముఖ శల్యవైద్యులు డాక్టర్ ఎస్.కృష్ణమరాజు దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వేదపండితులు తొలుత కలశ ప్రతిష్ట చేసి, వినాయక పూజ, పలు వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం సీతారాములను పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి వధూవరువులుగా కొలువుదీర్చారు. మంగళ వాయిద్యాలు, మంత్రోచ్చరణల మధ్య సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు వడపప్పు, పానకం ప్రసాదంగా పంపిణీ చేశారు.

గొల్లపల్లిలో..

అలాగే పుత్తూరు మండలం గొల్లపల్లిలో వెలసిన శ్రీరుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పుత్తూరు పట్టణం కాపువీధులోని శ్రీకోదండ రామస్వామి ఆలయంలో సీతా సమేత శ్రీరామస్వామి, లక్ష్మణ, ఆంజనేయస్వామి వార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టారు.

నగరిలో..

నగరి: పట్టణ పరిధిలోని భేరీవీధిలో వెలసిన కోదండరామాలయం, పాతభజనగుడి వీధిలోని రామాలయం, కొత్తపేట కోదండరామాలయాల్లో సీతారాములకు ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు వడపప్పు, పానకం ప్రసాదాలు అందించారు. మండలంలోని దిగువ అయనంబాకం, ఎగువ అయనంబాకం రామాలయాల్లో, రాజుల కండ్రిగలోని రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా జరిగాయి.

కల్యాణ వైభోగమే..

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనరాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను పెళ్లిపందిరిలో వేంచేపు చేసి వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో ముస్తాబు చేశారు. రుత్వికులు సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ శాస్త్రోక్తంగా మాంగళ్యధారణ క్రతువు పూర్తి చేశారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండలంలోని సింధురాజపురంలో శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ వేదపండితులు మంత్రాలు పఠిస్తూ సీతారాముల కల్యాణం జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బాలాజీ నాయుడు,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యుగంధర్.. నోరు అదుపులో పెట్టుకో..



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాలసముద్రం: అనునిత్యం ప్రజాసంక్షేమం కోసం కృషి చేసే డిప్యూటీ సీఎం నారాయణస్వామిని, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మిని విమర్శించే అర్హత జనసేన పార్టీ యుగంధర్‌కు లేదని వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ తెలిపారు. బుధవారం వారు పార్టీ కార్యకర్తలతో కలసి మండలంలోని శ్రీకావేరిరాజుపురంలో జరిగిన టీడీపీ సమావేశంలో యుగంధర్ చేసిన ఆరోపణలపై తీవ్రంగా స్పందించారు. ఉపాధిహామీ పథకం ఏపీఓగా పని చేసినప్పుడు యుగంధర్ ప్రభుత్వ సొమ్మును స్వాహా చేయడంతో విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే అన్నారు. ఉద్యోగాలు తీయిస్తామని చెప్పి చాలామంది దగ్గర డబ్బులు తీసుకుని మోసం చేసిన యుగంధర్ తమ పార్టీ పెద్దాయనపై విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబు వద్ద ప్యాకేజీ తీసుకున్నట్లు, యుగంధర్ కూడా టీడీపీ అభ్యర్థి వద్ద ప్యాకేజీ తీసుకుని ప్రచారానికి వచ్చారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని వారు హితవు పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ అయ్యప్ప, ఎంపీటీసీ గోవిందరాజ్, బాబు, అరుల్, రవి, తదితరులు పాల్గొన్నారు.